

బెళగావిలో చెత్త నిర్వహణకు రూ.135 కోట్లు

● రాష్ట్రంలో ఎంపికైన ఏకైక నగరం

బెంగళూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా బెళగావి నగరానికి చెత్త నిర్వహణకు రూ.135కోట్లు అదనపు గ్రాంట్లు లభించాయి. రాష్ట్రంలో ఈ గ్రాంటు లభించిన ఏకైక నగరం బెళగావి. జైపూర్‌లో ఇటీవల జరిగిన ఘనవ్యర్థ్యనిర్వహణ పథకం చతుర్భుజ ఒప్పందం జరిగింది. కేంద్ర నగరాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ తీర్మానించారు. కేంద్రం స్మార్ట్‌సిటీ పథకాలకు విశ్వాస్ పథకానికి సంబంధించి సదస్సు నిర్వహించింది. 2023 నవంబరు 16న ఢిల్లీలో దేశంలోని వంద స్మార్ట్ నగరాల అధికారులను ఆహ్వానించారు. ఫిబ్రవరిలో 84 నగరాలకు అవకాశం దక్కింది. తాజాగా రాజస్థాన్‌లో జరిగిన సభలో 18 నగరాలను ఎంపిక చేశారు. అందులో బెళగావి ఒకటిగా ఉంది. కేంద్ర నగరాభివృద్ధి మంత్రిత్వ కార్యాలయం సదస్సు నిర్వహించింది. బెళగావి నగర పాలిక కమిషనర్, పర్యావరణ ఇంజనీర్ హనుమంత కళాదగి బుధవారం మీడియాతో మాట్లాడుతూ రూ.135కోట్లు కేటాయించారన్నారు. ఆ నిధులతో చెత్త నిర్వహణ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) ద్వారా ఆదాయం పెంచుకోవాల్సి ఉందన్నారు. బయోగ్యాస్ విభాగంతోపాటు మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందన్నారు.

ప్యాలెస్ భూముల వివాదం...

టీడీఆర్ నిరాకరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్యాలెస్ భూములకు సంబంధించి టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) ఇచ్చేందుకు నిరాకరిస్తూ రూపొందించిన బిల్లుకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఆమోదించారు. దీంతో ప్యాలెస్ భూములకు సంబంధించి చట్టం తీసుకురానున్నారు. రాష్ట్రప్రభుత్వం ఇందుకు సంబంధించి గెజిట్‌ను జారీ చేయనుంది. ఆ తర్వాత సుప్రీంకోర్టుకు సమర్పించదలిచారు. బెంగళూరు ప్యాలెస్ మైదానానికి అనుబంధంగా 472.16 ఎకరాల భూమి ఉంది. అందులో బళ్లారి రోడ్డు, జయమహల్ రోడ్డులను విస్తరింపచేసేందుకు 15.29 ఎకరాలు స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మైసూరు రాజసంస్థానానికి చెందిన ప్యాలెస్ కావడంతో వారసుదారులు పరిహారం రూపంలో టీడీఆర్ ఇవ్వాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. రోడ్ల అభివృద్ధికి స్వాధీనం చేసుకునేభూమికి రూ.3వేలకోట్లు ఇవ్వాలని కోర్టు సూచించింది. కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఇప్పటికే టీడీఆర్‌ను సిద్ధం చేసి కోర్టుకు సమర్పించింది. టీడీఆర్‌కు విధించిన విలువ భారీగా ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం బెంగళూరు ప్యాలెస్ భూ సద్వినియోగం, నియంత్రణ బిల్లు 2025ను శాసనసభ ఉభయసభలలో అంగీకారం పొందింది. 1966లోనే ప్రభుత్వం బెంగళూరు ప్యాలెస్‌చే సంపాదన, బదిలీ నిబంధనలు రూపొందించి రూ.11కోట్లు పరిహారాన్ని డిపాజిట్ చేయడం ద్వారా మైదానాన్ని స్వాధీనం చేసుకుంది. ఈ బిల్లును హైకోర్టు ప్రశ్నించింది. సుప్రీంకోర్టు కూడా బిల్లుకు స్టే ఇవ్వలేదు. ఇలా ప్రభుత్వం, మైసూరు రాజ కుటుంబం మధ్య వివాదం సాగుతోంది.

కిడ్నీ మార్పిడిలో కర్ణాటక ముందంజ

● చికిత్సలు పొందిన వారికోసం క్రీడాపోటీలు



కిడ్నీ బాధితులతో వైద్యబృందం

బెంగళూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కిడ్నీ మార్పిడితోపాటు బాధితులకు వైద్యం అందించడంలో కర్ణాటక ముందంజలో ఉందని బీజీఎస్ గ్లెనిగల్ ఆసుపత్రి వైద్యనిపుణుడు అనిల్‌కుమార్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజీఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం కిడ్నీ శస్త్రచికిత్సలు పొందిన బాధితులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో కర్ణాటక ముందంజలో ఉందన్నారు. ఇప్పటి దాకా బీజీఎస్‌లో 900లకు పైగా అవయవ మార్పిడి చికిత్సలు జరిపించామన్నారు. కాలేయం, శ్వాసకోశ, పేగులతో పాటు ఇతరత్రా ఆపరేషన్‌లు సాధ్యం చేశామన్నారు. శస్త్రచికిత్సలు పొందాక సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్న పలువురు భాగస్వాములయ్యారు. క్రికెట్, లెమన్‌స్పూన్‌రేస్, 100 మీటర్ల పరుగు, బ్యాడ్మింటన్, క్యారెమ్, చెస్ తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన చర్చాగోష్ఠిలో బాధితులు వారి అనుభవాలను పంచుకున్నారు. కిడ్నీ జబ్బుతో ఏవిధంగా ఇబ్బంది పడింది ఆ తర్వాత చికిత్సలు, అవయవదానం చేసిన వారితో అనుబంధాలను పంచుకున్నారు. వైద్యనిపుణులు నరేంద్ర, ఆసుపత్రి సీఈఓ డాక్టర్ జతీందర్ అరోరాతో పాటు పలువురు పాల్గొన్నారు.



రంజాన్ వేళలు	
ఇఫ్తార్	సెహరీ
6.46	5.16
గురువారం సాయంత్రం	శుక్రవారం ఉదయం

నష్టాల బాటలో... ఆర్టీసీ..!



శక్తి గ్యారెంటీ నుంచి కోలుకోని కార్పొరేషన్లు

ఐదేళ్లలో రూ.5 వేల కోట్ల నష్టం

బెంగళూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మహిళలను శక్తివంతులను చేయదలిచామని రాష్ట్రంలోని ప్రతి మహిళా ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించే వెసలుబాటు తీసుకొస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం చేసింది. మేనిఫెస్టోలో శక్తిగ్యారెంటీ పేరిట పథకాన్ని అమలు చేస్తామని ఆర్భాటంగా చెప్పుకొన్నారు. 2023 మే నెలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగా నెల రోజుల తర్వాత శక్తి గ్యారెంటీని రాష్ట్రమంతటా శ్రీకారం చుట్టింది. ఆధార్ కార్డు గుర్తింపు ద్వారా రాష్ట్రానికి చెందిన మహిళలు నాలుగు కార్పొరేషన్లకు చెందిన బస్సు సర్వీసుల ద్వారా ఎక్కడైనా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించారు. మహిళలు బస్సులో ప్రయాణం చేస్తే ఎక్కడ నుంచి ఎక్కడివరకు వెళ్తారనేది నమోదు చేస్తారు. అందుకు అనుగుణంగా జీరో టిక్కెట్‌ను ఇస్తారు. ఇలా మరో మూడు నెలలు గడిస్తే రాష్ట్రంలో శక్తిగ్యారెంటీ



మహిళకు ఉచిత టిక్కెట్ ఇస్తున్న సీఎం, డీసీఎం (ఫైల్)



బస్సులో ప్రయాణిస్తున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకేశీ (ఫైల్)

ప్రారంభమై ఏకంగా రెండేళ్లవుతుంది.

నిర్వహణ భారంగా మారింది

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు అనుబంధంగా నాలుగు కార్పొరేషన్‌లు ఉన్నాయి. బెంగళూరు నగర పరిధికి సంబంధించి బెంగళూరు మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (బీఎంటీసీ), కర్ణాటక స్టేట్ ఆర్టీసీ (కేఎస్‌ఆర్టీసీ), కల్యాణ కర్ణాటక ఆర్టీసీ (కేకేఆర్టీసీ), వాయువ్య కర్ణాటక ఆర్టీసీ (ఎన్‌డబ్ల్యూఆర్టీసీ) ఉన్నాయి. దశాబ్దాలకాలంగా ఆర్టీసీ నష్టాల్లోనే కొనసాగుతోంది. ఏడాదికి రెండుమూడుసార్లు డీజిల్ ధరలు పెరగడం, నిర్వహణ భారం అధికమవుతున్నా ఎప్పటికప్పుడు బస్సు చార్జీలు పెంచే పరిస్థితి లేకపోవడంతో నష్టాలు వస్తున్నాయి.

దేశంలోనే అత్యుత్తమ ఆర్టీసీ

దేశవ్యాప్తంగా ప్రతిరాష్ట్రం ఆర్టీసీ బస్సుసర్వీసులు కొనసాగిస్తోంది. అయితే కర్ణాటకలోని నాలుగు కార్పొరేషన్లు అత్యుత్తమమైనవిగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. దేశమంతటా గుర్తింపు, ప్రశంసలు లభిస్తున్నా, లాభాల బాటకు మాత్రం చేరుకోలేదు. ఏటా ఎన్నో పురస్కారాలు మాత్రం వరిస్తున్నాయి. కేఎస్‌ఆర్టీసీ, బీఎంటీసీ సంస్థలకు అవార్డులు వచ్చేందుకు వెనుక పలు సాంకేతిక సరళీకృతం కూడా కారణమవుతోంది. వేలాదిమంది ఉద్యోగులు పనిచేస్తున్న సంస్థలో సెలవులు, అడ్వాన్సులు, ఇతరత్రా సేవలను ఎటువంటి అనుమతులు లేకుండానే డిజిటల్ రూపంలో పొందవచ్చు. తద్వారా ఉన్నతాధికారుల నుంచి వేధింపులు ఉండవనేది కారణంగా ఉంది. బస్సుల పర్యవేక్షణ ఆదర్శంగా కొనసాగుతోంది. బస్టాండ్‌లు, ఇతరత్రా సేవలకుగాను అవార్డులు దక్కుతున్నాయి.

శక్తి గ్యారెంటీతో లాభాలంటూ ప్రచారం

రాష్ట్రంలో శక్తిగ్యారెంటీ అమలయ్యాక ఆర్టీసీకి లాభాలంటూ పలు సందర్భాలలో ఆర్టీసీ ఉన్నతాధికారులు, మంత్రులు బహిరంగంగా వ్యక్తం చేశారు. మహిళలు ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు ఉందని, తద్వారా వారి కుటుంబీకులు కలసి వస్తారని ఇలా శక్తి గ్యారెంటీ ప్రారంభమయ్యాక, మహిళలతోపాటు పురుషులు ప్రయాణించేవారి సంఖ్య పెరిగిందని ప్రకటించారు. శక్తి గ్యారెంటీ తర్వాత నాలుగు కార్పొరేషన్లకు నష్టాలు వాటిల్లుతున్నట్లు స్వయానా రవాణశాఖ మంత్రి రామలింగారెడ్డి ప్రకటించారు.

ఐదేళ్లలో ఆర్టీసీలకు రూ.5వేల కోట్ల నష్టం

ఐదేళ్లలో కేఎస్‌ఆర్టీసీకి రూ.1500కోట్లు, బీఎంటీసీకి 1544 కోట్లు, కల్యాణ కర్ణాటక ఆర్టీసీకి రూ.777 కోట్లు, వాయువ్య కర్ణాటక 1386 కోట్లు నష్టం వచ్చింది. 40శాతం బస్సులు నష్టాలలో కొనసాగుతుండగా, 30శాతం బస్సులు లాభాలు, నష్టాలులేకుండా నడుస్తున్నాయి. 30శాతం బస్సులలో మాత్రమే లాభాలు సాధ్యమవుతున్నాయి. ప్రతిరోజూ 9.75 కోట్ల రూపాయలు ఆర్టీసీ నిర్వహణకు ఖర్చు అవుతోంది.

శక్తి గ్యారెంటీ ద్వారా ఇప్పటివరకు 9978 కోట్ల రూపాయలు ఖర్చు అయ్యింది. ఇందులో 448 బీఎంటీసీ బస్సులు కొనుగోలు చేశారు. 2016 నుంచి ఇప్పటివరకు 10వేలమంది ఉద్యోగ నియామకాలు జరిపారు. 5,360 బస్సులను కొత్తగా కొనుగోలు చేశారు. ఇంతకుముందు ప్రతిరోజూ 1.40 లక్షల ట్రిప్పులు ఉండగా ప్రస్తుతం 1.90 లక్షలకు చేరాయి.

శక్తి గ్యారెంటీ తర్వాత నష్టం (2023-24) కోట్ల రూపాయల్లో..

	కేఎస్‌ఆర్టీసీ	బీఎంటీసీ	కేకేఆర్టీసీ	ఎన్‌డబ్ల్యుఆర్టీసీ
ఆదాయం	4544	2613	2299	2372
ఖర్చు	4839	3189	2452	2695
ప్రభుత్వ రాయితీ	248	407	121	142
నష్టం	295	575	161	322



సీఎం సిద్దరామయ్యను కలుసుకున్న మంత్రి పొన్ముడి, ఎంపీ అబ్దుల్లా

కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎంతో మంత్రి పొన్ముడి భేటీ

పెరంబూర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు నియోజకవర్గాల పునర్వ్యస్థీకరణ వ్యవహారంపై, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను రాష్ట్ర మంత్రి పొన్ముడి బుధవారం స్వయంగా కలుసుకుని చర్చించారు. నియోజకవర్గాల పునర్వ్యస్థీకరణతో రాష్ట్రానికి కలిగే ఇబ్బందులపై ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో గత వారం అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలతో సమన్వయక కమిటీ ఏర్పాటుచేయాలని తీర్మానించారు. నియోజకవర్గాల పునర్వ్యస్థీకరణపై నగరంలో ఈ నెల 22న దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అధికార, ప్రతిపక్ష, ప్రాంతీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని డీఎంకే, అధ్యక్షుడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. అందులో భాగంగా బెంగళూరు వెళ్లిన రాష్ట్ర మంత్రి పొన్ముడి, ఎంపీ అబ్దుల్లా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసి సమావేశంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి తదితరులను రాష్ట్ర మంత్రి, ఎంపీలతో కూడిన బృందం కలుసుకుని సమావేశానికి ఆహ్వానించారు.

నగరంలో హలీం సందడి

బెంగళూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రంగా ఎన్నో ఏళ్లుగా విక్రయిస్తున్న పిస్తా హౌస్ హలీం వంటకం నగరంలోనూ సందడి చేస్తోంది. రంజాన్ మాసంలో మాత్రమే హలీంను తయారు చేస్తారు. హలీంకు శతాబ్దాల చరిత్ర ఉంది. ఇది ఇరాన్ దేశంలోని ప్రముఖమైన వంటకం. హైదరాబాద్ నవాబ్‌ల కాలంలో ఇరాన్ నుంచి పాకనిపుణులను రప్పించి హలీం తయారీ చేయించేవారు. అప్పటి నుంచి హైదరాబాద్‌లో హలీంను విక్రయిస్తున్నారు. పిస్తా హౌస్ బెంగళూరు నిర్వాహకుడు షఫీక్ అహ్మద్ తెలిపిన మేరకు స్వచ్ఛమైన మాంసం, నెయ్యి, డ్రైఫ్రూట్స్, గోధుమ పిండితో దేశీయ మసాలాల విధానంతో హలీం తయారు చేస్తామన్నారు. కనీసం 12 గంటలపాటు వండాల్సి ఉంటుందన్నారు. పూర్తిగా కట్టెలపొయ్యి ద్వారానే ఒకేసారి హలీం తయారు చేస్తామన్నారు. హలీంలో 28 శాతం ప్రొటీన్‌లు ఉంటాయని, ఉపవాసదీక్షలో ఉండేవారికి శక్తి కోసం హలీంను తయారు చేస్తామన్నారు. ఇన్‌ఫ్యాంట్రీ రోడ్డులో పిస్తాహౌస్ కేంద్రం నుంచి నగర వ్యాప్తంగా 50 కౌంటర్‌ల ద్వారా విక్రయిస్తున్నామన్నారు. వీటితోపాటు బిరియాని, ప్రత్యేకమైన స్వీట్లు అందిస్తామన్నారు.



హలీం తయారీ ఇలా...

ప్రైవేట్ బస్సుల ఢీ.. ఒకరి మృతి

● 20మందికిపైగా గాయాలు



ఢీకొన్న బస్సులు

శ్రీనివాసపుర, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చింతామణి-మదనపల్లి రహదారిపై కోలారు జిల్లా శ్రీనివాసపుర తాలూకా గుంటపల్లిక్రాస్ వద్ద మంగళవారం రాత్రి రెండు ప్రైవేట్ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ప్రమాదంలో 20మందికిపైగా గాయపడగా వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుడు సువర్ణముఖి బస్సు డ్రైవర్, సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చెందిన గంగాధర్(45)గా గుర్తించారు. బెంగళూరు నుంచి చింతామణి మార్గంలో మదనపల్లికి వెళ్తున్న ఏఆర్ ట్రావెల్స్ స్లీపర్ కోచ్, మదనపల్లి నుంచి చింతామణి మార్గంలో బెంగళూరుకు వస్తున్న సువర్ణముఖి బస్సు ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో గుంటపల్లి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో బస్సు డ్రైవర్ మృతి చెందగా 20మందికిపైగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని బెంగళూరు నిమ్హాన్స్ ఆసుపత్రికి తరలించారు. ఇతరులను మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. రాయల్పాడు ఎస్‌ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

చక్కెర కర్మాగారం ఏర్పాటు చేయాలి



● అఖిల కర్ణాటక కిసాన్ జాగృతి సంఘం డిమాండ్

● రైతులతో హోస్పేట్ వరకు పాదయాత్ర

8

గ్యారెంటీల అమలు కమిటీలను

రద్దు చేయండి..!

● రెండోరోజూ స్తంభించిన అసెంబ్లీ

● పాదయాత్రగా రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు ప్రతిపక్షాల వినతి



కెంగల్ హనుమంతయ్య విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రతిపక్షాలు

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్యారెంటీల అమలు కమిటీ రద్దును డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ బుధవారం కూడా అసెంబ్లీలో ఆందోళన కొనసాగించాయి. ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ గ్యారెంటీలు భారం అవుతున్నాయని, అభివృద్ధి కుంటుపడుతోందని సొంత పార్టీ ఎమ్మెల్యేలు వ్యాఖ్యానిస్తున్నారన్నారు. అమలు కమిటీ పేరిట కార్యకర్తలకు హోదాలు కల్పించడం, ప్రజాసొమ్మును వేలాదిగా వేతనాలు చెల్లించడం సరికాదని అన్నారు. పోడియంలోకి దూసుకెళ్లి నిరసన కొనసాగించారు. సభ గందరగోళంగా మారింది. అధికార, ప్రతిపక్షసభ్యుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. సీఎం సిద్దరామయ్య గ్యారెంటీలతోపాటు అమలు కమిటీకి వత్తాసు పలికారు. సభ నియంత్రణలోకి రాకపోవడంతో స్పీకర్ యూటీ ఖాదర్ వాయిదా వేశారు. దీంతో ప్రతిపక్షాల సభ్యులు ప్రభుత్వతీరును నిరసిస్తూ అసెంబ్లీ నుంచి బయటకొచ్చారు. విధానసౌధ నిర్మాత కెంగల్ హనుమంతయ్య విగ్రహం వద్ద ఆందోళన చేశారు. అక్కడి నుంచి పాదయాత్రగా రాజ్‌భవన్‌కు వెళ్లారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్షనేత అశోక్, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర గవర్నర్‌కు పరిస్థితిని వివరించారు. ఎమ్మెల్యేలకు ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్న హక్కులను కాలరాసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. శాసనసభ నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలు ఉండగా గ్యారెంటీల అమలు కమిటీ సభ్యులు ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ కార్యకర్తలకు వేలాదిరూపాయల ప్రజాసొమ్ము కట్టబెడుతున్నారని వివరించారు.



శాసనసభ పోడియం వద్ద ప్రతిపక్ష నేతల నినాదాలు



గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



సింహ వాహనంపై శ్రీవారు

తిరువీధుల్లో విహరిస్తూ.. భక్తులకు దర్శనం

కదిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలలో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నారసింహుడు బుధవారం సింహవాహనంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. యాగశాల నుంచి ఉదయం విచ్చేసిన శ్రీవారికి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం శ్రీవారిని సింహ వాహనంపై అలంకరించి, ఆలయ ప్రాంగణంలో కొలువుదీర్చారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తిరువీధుల్లో శ్రీవారు విహరించారు. వాహన సేవలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు, సింహవాహనంపై విహరిస్తున్న నారసింహుడు

నేడు హనుమంత వాహనంపై..

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి గురువారం హనుమంతవాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం నిత్యపూజలు, హోమాల అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. సంధ్యా సమయంలో హనుమంతవాహనంపై కొలువుదీరి శ్రీవారు తిరువీధుల్లో విహరిస్తారు. శ్రీ మహావిష్ణువు దశావతారాల్లో ఒక్కటి అయిన రాముడిని తన భుజస్కంధాలపై మోసిన హనుమంతుడు మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరగా, నృసింహావతారంలో కోరిక నెరవేరుతుందని శ్రీరాముడు వరమిచ్చారని, అందుకే నారసింహుడికి హనుమంత వాహన సేవ నిర్వహిస్తారని వేద పండితులు తెలిపారు.


ఏమరుపాటుగా ఉంటే బురిడీ కొట్టిస్తారు. ఆశకు పోతే లూటీ చేసేస్తారు. పెట్టుబడులు, రుణాలు, కొరియర్.. ఇలా ఏవేవో చెప్పి లైన్‌లోకి వస్తారు. లింకు పంపి ఓపెన్ చేయమంటారు. ఓటీపీ చెప్పమంటారు. బ్యాంకు అధికారులు, పోలీసులు, సీబీఐ.. ఇలా ఎవరెవరి పేరిటో లైన్‌లోకి వచ్చి బెదిరిస్తారు. బ్యాంకులో ఉన్న సొమ్మును దోచుకుంటున్నారు. నేరుగా వచ్చి సొమ్ము దోచుకునే సొమ్ముకంటే ఎక్కడో ఉంటూ.. మన సెల్‌ఫోన్‌లోకి చొరబడి దోచుకునే సొమ్ము చాలా ఎక్కువ అని పోలీసులు అంటున్నారు. వీరితో జాగ్రత్తగా ఉండాలని ఏకంగా 'కాలర్ టోన్' ద్వారా అవగాహన పెంచుతున్నారంటే.. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఎవరికివారు జాగ్రత్తగా ఉండటం దీనికి ఉత్తమ పరిష్కారం. ఒక్కసారి సొమ్ము దొంగలచేతిలో పడితే.. తిరిగి రావడం చాలా కష్టం. ఏ కొద్దిమంది సొమ్మో రికవరీ అవుతోంది.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం/నెట్‌వర్క్



సెల్‌లో చోరబాటు..!

● అనంతపురం సమీపంలోని ఓ గ్రామానికి చెందిన రాగే ఎల్లప్ప బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. గతేడాది దసరా పండుగకు ఇక్కడకు వచ్చారు. అక్టోబరు 10న ఎస్‌బీఐ యోనో యాప్‌లో పాన్ కార్డు అప్‌డేట్ చేస్తుండగా... అప్‌డేట్ ఆధార్, ఆర్ పాన్ ఫర్ ఎస్‌బీఐ అనే పేరుతో ఏపీకే లింక్ వచ్చింది. అది క్లిక్ చేసిన వెంటనే రూ.49వేలు అతడి బ్యాంకు ఖాతా నుంచి డెబిట్ అయింది. కొంతసేపటికే మరోసారి రూ.50వేలు కట్ అయింది. దీంతో అప్రమత్తమైన ఎల్లప్ప కస్టమర్ కేర్‌కు ఫోన్ చేశారు. వారు రెస్పాన్స్ ఇచ్చేలోపే మరోసారి రూ.49,999 కట్ అయింది. దీనిపై బాధితుడు.. సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా ఎస్‌బీఐ అధికారులను కలిశారు. ఆధార్, పాన్, ఫిర్యాదు లేఖ తీసుకున్నారు. ఇంతవరకు రికవరీ లేదు.



ఎల్లప్ప ఖాతా నుంచి డబ్బు వెళ్లగానే ఎస్‌బీఐ నుంచి వచ్చిన మెసేజ్

● గార్లదిన్నె మండలానికి చెందిన రామాంజికి ఈ ఏడాది జనవరి 24వ తేదీన వాట్సాప్ వీడియోకాల్ వచ్చింది. ఒకరు హిందీ, మరొకరు తెలుగులో మాట్లాడారు. తాము సీబీఐ అధికారులమనీ, సైబర్ క్రైం ఇష్యూకు సంబంధించి ముంబై నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. ఆధార్‌కార్డు దుర్వినియోగం చేశారనీ, కేసు నమోదైందనీ, ఇంట్లో ఉండి డోర్ వేసుకుని ఎవరితో మాట్లాడకుండా ఉండాలని చెప్పారు. బ్యాంకు ఖాతా వివరాలు చెప్పాలని కోరారు. ఫోన్‌పేలో డబ్బు ఎంత ఉందో స్క్రీన్‌షాట్ పెట్టమన్నారు. అది పెట్టగానే.. అకౌంట్ ట్రాన్సాక్షన్స్ చూస్తామని చెప్పి రూ.49,999 పంపమన్నారు. రామాంజికి అనుమానం వచ్చినా.. భయంతో వారికి ఫోన్‌పే చేశాడు. ఇంకో అకౌంట్ ఉంటే ఆ వివరాలు పంపాలన్నారు. మరో అకౌంట్‌లో రూ.1.50లక్ష ఉండటంతో బ్యాంకు వారితో మాట్లాడతానని చెప్పి ఫోన్ కట్ చేశాడు.



గార్లదిన్నె మండలానికి చెందిన వ్యక్తికి వీడియో కాల్ చేసింది ఈ వాట్సాప్ గ్రూప్ నుంచే



రెచ్చిపోతున్న సైబర్ దొంగలు

● లింకులు పంపి.. సొమ్ము చోరీ
● లోన్, ఇన్వెస్ట్‌మెంట్ పేరిట బురిడీ
● రెండేళ్లలో రూ.53 కోట్లు లూటీ
● అప్రమత్తత.. అవగాహనే శరణ్యం

● అనంతపురం నగరంలోని హౌసింగ్‌బోర్డులో మేకల షేక్ హుస్సేన్, షేక్ రిజ్వానా దంపతులు నివాసముంటున్నారు. షేక్ హుస్సేన్ దక్షిణాఫ్రికాలో మైనింగ్ కంపెనీలో పనిచేస్తుంటారు. ఇక్కడకు వచ్చినపుడు సెప్టెంబరు 12న ఫేస్‌బుక్‌లో షేర్ మార్కెట్‌లో జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీస్ పేరుతో ఉన్న ఓ లింక్‌ను క్లిక్ చేశాడు. వెంటనే వాట్సాప్‌లో ఐశ్వర్యశాస్త్రి పేరుతో ఒకామె చాట్ చేసింది. ఇందులో పెట్టుబడి పెడితే లాభాలొస్తాయని చెప్పింది. ఈక్రమంలో షేక్ హుస్సేన్ తొలుత రూ.2లక్షలు, రూ.3లక్షలు.. ఇలా పెట్టుబడి పెడుతూ వచ్చారు. తిరిగి అక్కడకు వెళ్లాక తన భార్యతో బ్యాంకులో డబ్బు వేయించారు. అదే క్రమంలో రూ.15లక్షలు, రూ.20లక్షలు సైతం వేశారు. చివరకు ఇల్లు విక్రయించి డబ్బు పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. అలా గతేడాది డిసెంబరు 4న ఒకేసారి రూ.40లక్షలు అతడి భార్య.. భర్త చెప్పిన అకౌంట్‌కు నగదు పంపారు. సంబంధిత బ్యాంకు మేనేజర్ 'ఎందుకు అంత అమౌంట్ పంపుతున్నారు.. రెండు రోజులు ఆలోచించండి..' అన్నారట. అయినా.. వారు వినలేదు. అలా మొత్తం రూ..1.33 కోట్లు పంపాక మోసపోయామని తెలిసింది. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, సైబర్ పోలీసులకు తెలియజేశారు.

● రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లికి చెందిన ఓ మహిళ గతనెల మొదటివారంలో పుట్టినిల్లయిన చెన్నేకొత్తపల్లి మండలం ఓబుళంపల్లికి వెళ్లింది. ఈనెల 2వ తేదీన ఆ మహిళ సెల్‌ఫోన్‌కు ఓ గుర్తుతెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. ఆరోగ్యశ్రీ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నానని చెప్పాడు. 'మీ నాన్నకు ఆరోగ్య శ్రీ కింద రెండేళ్ల క్రితం శస్త్రచికిత్స చేశారనీ, దానికి సంబంధించి ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.40వేలు పెండింగ్‌లో ఉందనీ, ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతాకు జమ చేస్తాన'ని నమ్మబలికాడు. అందుకు సెల్‌ఫోన్‌కు లింక్ పంపుతాననీ, దానిని ఓపెన్ చేసి క్లిక్ చేయాలని చెప్పాడు. అది నమ్మిన ఆ మహిళ తనకు వచ్చిన లింక్‌పై క్లిక్ చేసింది. కొంతసేపటికే రూ.47,287 ఆమె బ్యాంకు అకౌంట్ నుంచి కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. విషయం ఆ మహిళ.. సంబంధిత గుర్తుతెలియని వ్యక్తికి చెప్పగా... మరోసారి లింకు పంపిస్తాననీ, పెండింగ్‌లో ఉన్న బిల్లు, ఇప్పుడు పోయిన మొత్తం జమ అవుతుందని చెప్పాడు. అలా మరో లింక్‌ను క్లిక్ చేయగానే.. క్షణాల్లో రూ.40వేలు ఖాతా నుంచి వెళ్లినట్లు మెసేజ్ వచ్చింది. అదే విషయంలో ఆమె నిలదీయగా.. మరోసారి ట్రై చేయమన్నాడు. ఈసారి క్లిక్ చేయగానే... అమె అకౌంట్ నుంచి రూ.17500 డబ్బు మాయమైంది. దీంతో మోసపోయానని గ్రహించి టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి, విషయం తెలియజేసింది. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.



● నెలరోజుల క్రితం అనంతపురంలోని రామచంద్రనగర్‌లో ఓ జనరల్ స్టోర్ నిర్వాహకుడు... ఫోన్ పేలో సమస్య రావడంతో గూగుల్‌లో ఫోన్‌పే కస్టమర్ కేర్ నంబర్ సెర్చ్ చేశాడు. కొన్ని నంబర్లు కనిపించాయి. అందులో మొదటి నంబర్‌కు కాల్ చేసి, సమస్య చెప్పాడు. అవతలి వ్యక్తి మాట్లాడుతూ.. 'నీ ఫోన్ పేకు రూపాయి పంపుతాన'ని చెప్పాడు. జనరల్ స్టోర్ నిర్వాహకుడిని రూపాయి పంపమని కోరాడు. ఈ సమస్య ఇలాగే కొనసాగుతుందని చెప్పి.. ఓటీపీ వస్తుందనీ, అది చెప్పమన్నాడు. షాపు నిర్వాహకుడు ఓటీపీ పంపిన సెకన్లలో అతడి బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న రూ.8వేలు కట్ అయింది.

● ముదిగుబ్బ మండలంలోని ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తూ ఇంటి వద్ద ఉంటున్నాడు. జనవరిలో సైబర్ నేరగాళ్లు వీడియోకాల్ చేసి, 'నీపై 18 కేసులు నమోదయ్యాయనీ, నీ పేరుతో అక్రమ రవాణాలు సాగుతున్నాయనీ, రూ.4.50 లక్షలు పంపితే అకౌంట్ ఫ్రీజ్ కాకుండా ఆపుతామ'ని బెదిరించారు. దీంతో భయపడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మొత్తం డబ్బు యాప్‌లో పంపాడు.

● ముదిగుబ్బ మండలంలోని ఒక వ్యక్తికి కారు లాటరీ తగిలిందని వాట్సాప్‌లో ఫొటోలు పంపారు. జీఎస్టీ, రిజిస్ట్రేషన్ తదితరాలకు అమౌంట్ పంపాలని నమ్మబలికారు. రూ.6లక్షలు సైబర్ నేరగాళ్లు జమ చేయించుకున్నారు. తరువాత మోసపోయానని తెలుసుకున్న బాధితుడు.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● ముదిగుబ్బ మండలంలోని ఒక వ్యాపారికి తన ఖాతాలోకి 5వేల రూపాయలు జమ అయినట్లు మెసేజ్ వచ్చింది. మెసేజ్ ఓపెన్ చేసి చూసేసరికి రూ.32వేలు ఖాతా నుంచి మాయమైంది. దీనిపై బాధితుడు.. సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేసి తెలిపాడు.

● గుంతకల్లులో పలువురు వ్యక్తులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి డబ్బు పోగొట్టుకున్నారు. డిసెంబరులో 12, ఈ ఏడాది జనవరిలో 17 సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. పట్టణానికి చెందిన జీ రామాంజనేయులు అనే రైల్వే ఉద్యోగి ఖాతా నుంచి నెల కిందట రూ.95,000 తస్కరించారు. జీతం పడిన వెంటనే రూ.50 వేలు, రెండో దఫాగా రూ.45 వేలు డబ్బు డ్రా అయిపోయాయి. బ్యాంకుకు వెళ్లి అడిగితే ట్రాన్సాక్షన్‌కు సంబంధించిన వివరాలేవీ లభ్యం కావడంలేదని బ్యాంకు అధికారులు చేతులెత్తేశారని బాధితుడు వాపోయాడు. సంపత్ కుమార్ అనే వ్యక్తికి డ్రోన్ కెమెరా పంపుతున్నామంటూ రూ.17 వేలు కాజేశారు. వరదరాజులు అనే మాజీ కౌన్సిలర్ ఖాతా నుంచి రూ.20 వేలు తస్కరించారు. మూడు నెలల కిందట వజ్రకరూరు మండలం గంజికుంట గ్రామానికి చెందిన శివారెడ్డి వాట్సాప్‌కు ఓ పోస్టు రాగా, దాన్ని చూడటానికి టచ్‌చేశారు. వెంటనే అతడి ఫోన్‌లోకి ఓ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ అయ్యి అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ. 9,975 చొప్పున రెండుసార్లు డబ్బు డ్రాచేసేశారు. వీటన్నిటిపైనా సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఒక్క కేసూ పరిష్కారం కాలేదు.



ఎక్కువగా ఇలా చేస్తారు...!



సైబర్ నేరగాళ్లు సీబీఐ, ఈడీ, నార్కోటిక్, ఐటీ, ఆర్‌బీఐ, కస్టమ్స్, పోలీసు అధికారులం అంటూ ఫోన్ కాల్ చేస్తుంటారు. 'మీ పేరుపై కొరియర్ వచ్చిందని, అందులో డ్రగ్స్ వెపన్స్, అక్రమ వస్తువులు ఉన్నాయ'ని బెదిరిస్తారు. 'మీ బ్యాంకు అకౌంట్, ఆధార్, పాన్, మొబైల్ నంబర్ల ద్వారా మనీ ల్యాండరింగ్ జరిగిందనీ, మీపై కేసులున్నాయని వీడియో కాల్ ద్వారా విచారణ' అంటూ డిజిటల్ అరెస్ట్ పేరుతో భయభ్రాంతులకు లోనుచేస్తారు. ఈ కేసులో బెయిల్ కావాలన్నా కేసు నుంచి తప్పించాలన్నా డబ్బు పంపాలని బెదిరిస్తుంటారు. ఇలా డబ్బు దోచుకోవటాన్ని డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్ అంటారు.

ఫేక్ లోన్‌యాప్ ఫ్రాడ్

సామాజిక మాధ్యమాల ద్వారా లింకులు పంపి లోన్ పొందడానికి ఎలాంటి డాక్యుమెంట్స్ అవసరం లేదని ఎర వేసి, చిన్న మొత్తంలో లోన్ ఇచ్చి, రోజులు గడవకముందే ఫోన్ చేసి వడ్డీతో సహా డబ్బు కట్టమనీ, లేదంటే ఫొటోలను మార్ఫింగ్ చేసి, కుటుంబ సభ్యులు, స్నేహితులకు పంపుతామని బలవంతంగా డబ్బు తీసుకుంటారు. దన్ని ఫేక్ లోన్‌యాప్ ఫ్రాడ్ అంటారు.

ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్..

సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు చేసి తమ సంస్థ ద్వారా స్టాక్‌మార్కెట్‌లో ట్రేడింగ్/ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే తక్కువ సమయంలో అధిక లాభాలు పొందవచ్చని నకిలీ యాప్స్/వెబ్‌సైట్లలో లాభాలు పొందుతున్నట్లు చూపిస్తూ డబ్బు దోచేస్తున్నారు.

ఏపీకే ఫైల్ ఫ్రాడ్

సైబర్ నేరగాళ్లు మోసపూరితమైన లింక్స్/ఏపీకే ఫైల్స్ పంపి వాటిని క్లిక్ చేస్తే మొబైల్‌లో హానికరమైన ఏపీకే ఫైల్ ఇన్‌స్టాల్ అయి, వాట్సాప్‌ను హ్యాక్ చేసి వ్యక్తిగత, ఆర్థిక సమాచారం అపహరిస్తారు. తద్వారా డబ్బును దోచేస్తారు. స్నేహితులు, కుటుంబసభ్యులకు ఈ హానికరమైన ఏపీకే ఫైల్స్‌ను పంపి, వారి మొబైల్ ఫోన్స్ హ్యాక్ చేస్తారు. ఇంకా టెలిగ్రామ్‌లలో ఇన్వెస్ట్ చేయాలని చెబుతూ... రూ.వెయ్యికి రూ.1500 అదనంగా వేస్తారు. రూ.2వేలకు రూ.3000 రూ.5వేలకు రూ.8వేలు పంపుతారు. రూ.7వేలు వేయగానే డబ్బు రాదు. డబ్బు రావాలంటే అదనంగా పంపాలని మోసం చేస్తాడు. ఆ మొత్తం పంపితే అంతే సంగతి.

తిరిగొచ్చేది చాలా తక్కువ...

అనంతపురం నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళ గతేడాది ఏప్రిల్‌లో తన బ్యాంకు అకౌంట్ నుంచి రూ.10లక్షలు మాయమయ్యాయని సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారించిన సైబర్ క్రైమ్ విభాగాధికారులు అ డబ్బు వెళ్లిన విధానం విస్తుగొలిపింది. మధ్యలో ఎలాంటి సంబంధంలేని వ్యక్తి అకౌంట్ ద్వారా సైబర్ నేరగాళ్లు ఆ డబ్బు లాక్కున్నారు. ఆ మహిళ అకౌంట్ నుంచి పశ్చిమ బెంగాల్‌లోని ఓ ప్రభుత్వ ఉద్యోగి అకౌంట్‌కు వెళ్లింది. ఆ అకౌంట్ నుంచి సైబర్ నేరస్తులు మరో అకౌంట్‌కు బదిలీ చేసుకున్నారు. ఎట్టకేలకు పోలీసులు ఆ డబ్బు తిరిగి ఆ మహిళ అకౌంట్‌కు వచ్చేలా చేశారు. ఇలాంటి కేసులు చాలా తక్కువనీ, ముందుగానే వివరాలన్నీ తెలియజేసి, వారికి డబ్బు పంపుతున్నట్లు సమాచారం చేరవేస్తే ఆ డబ్బు తీసుకురావడం చాలా కష్టమంటున్నారు సైబర్ విభాగ అధికారులు.

రూ.కోటి వెళ్తే... రూ.22లక్షలే వచ్చాయి..

ఏడాదిన్నర క్రితం నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ బార్ అండ్ రెస్టారెంట్ యజమాని అకౌంట్ నుంచి రూ.కోటి మాయమైంది. మరుసటి రోజు బ్యాంకు అధికారులు విషయం తెలియజేశారు. కేవలం ఆరు ట్రాన్సాక్షన్లతోనే రెండురోజుల వ్యవధిలో రూ.కోటి మాయమైంది. సైబర్ నేరగాళ్లు అలా దోచేసిన ఘటనపై బాధితుడు.. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇందులో హర్యానా, ఢిల్లీ వాసుల ప్రమేయం ఉందని తెలిసి పోలీసులు పలుసార్లు తిరిగి రూ.22లక్షలు మాత్రమే పట్టుకురాగలిగారు. బ్యాంకు బాధితుడికి బాధ్యతగా ఆ డబ్బు అందజేయాల్సి ఉంటుంది. అది వేరే సంగతి.

రోజూ 10 ఫిర్యాదులు

జిల్లావ్యాప్తంగా ఫ్రాడ్‌కాల్స్‌పై రోజూ 8 నుంచి 10 ఫిర్యాదులు వస్తుంటాయని సైబర్ విభాగ అధికారులు చెబుతున్నారు. ముందుగానే బ్యాంక్ అకౌంట్ వివరాలన్నీ తెలియజేసి, డబ్బు పంపితే వెనక్కు తీసుకురావడం కష్టమేనంటున్నారు సైబర్ పోలీసులు. ఉన్నఫలంగా అకౌంట్ నుంచి మాయమైతే అది కూడా కొన్ని గంటల్లోపే ఫిర్యాదు చేస్తే కొంతవరకు హోల్డ్ చేసే అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు.



● చైనీస్ మూలాలేనా..?

సైబర్ మోసాల వెనుక చైనీస్ మూలాలున్నట్లు పోలీసు వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ మోసాల ద్వారా వెళ్లే డబ్బు టాప్‌లో నడిపిస్తున్న ఒకే ఒక్కడికి ఎక్కువ శాతం వెళ్తుంటుంది. ఈ సైబర్ క్రైమ్‌లో పాలుపంచుకున్న వారికి పర్సెంటేజీల తరహాలో వెళ్తుంటుంది. ఆ కీలక వ్యక్తి ఎవరనేది ఎవరికీ తెలియదు. ఈ వ్యవహారమంతా అంతర్జాతీయ స్థాయిలో సాగుతోందనేది ఒక అంచనా. చాలాసార్లు ఈ డబ్బు దేశాన్ని సైతం దాటిపోయి ఉంటుందని సైబర్ వర్గాలు చెబుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఆ డబ్బు తిరిగి ఖాతాల్లో జమ అవడం చాలా చాలా కష్టమట. ఫేక్ ఫైల్స్ ఉన్న లింకులను ఓపెన్ చేయకపోవడం, ఎవరైనా ఫోన్ చేసి వ్యక్తిగత బ్యాంకు, ఆధార్, పాన్, ఓటీపీలను అడిగితే చెప్పకపోవడమే సేఫ్. నష్టపోయి, పోలీసులను ఆశ్రయించడం ద్వారా పెద్దగా ఉపయోగమేమీ ఉండకపోవచ్చు. జాగ్రత్తే శ్రీరామ రక్ష.

● రెండేళ్లలో రూ.53కోట్ల దోపిడీ..

జిల్లాలో దోపిడీ దొంగల కంటే సైబర్ నేరస్తులు ఎత్తుకెళ్లేదే ఎక్కువగా ఉంది. జిల్లా పరిధిలో ఏటా జరిగే చోరీల్లో రూ.6కోట్ల వరకు దోచుకెళ్తుంటారనేది పోలీసు వర్గాల అంచనా. గత రెండేళ్లలో సైబర్ నేరగాళ్లు రూ.53కోట్లు కాజేశారట. 2023, 24 సంవత్సరాల్లో జిల్లావ్యాప్తంగా ఇంత మొత్తం కాజేసి ఉంటారని సైబర్ లెక్కలు చెబుతున్నాయి.

● రైతులనూ వదలక..

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో రైతన్నలు కూడా చిక్కుతున్నారు. బొమ్మనహాళ్ మండలం దర్గా హొన్నూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు రైతులు ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బు దోచేశారు. ఈ ఏడాది జనవరి 20వ తేదీన దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన రైతు చిత్రశేఖర్ మొబైల్ నంబరుకు ఓటీపీ వచ్చింది. కెనరా బ్యాంకు నుంచి మొదటి సారి రూ.99వేలు కట్ అయింది. రెండోసారి మళ్లీ ఓటీపీ వచ్చిం ది. మళ్లీ రూ.49,999 కట్ అయింది. బ్యాంకు అధికారులను సంప్రదిస్తే ఫోన్‌పే లింకు ద్వారా కట్ అయిందని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేశాననీ, ఇంకా డబ్బు రాలేద ని బాధితుడు వాపో యాడు. బొమ్మన హాళ్ మండలం దర్గాహొన్నూరు చెందిన నుంకేష్ మొబైల్‌కు జనవరిలో ఓటీపీ వచ్చింది. రూ.5 వేలు చొప్పున రెండుసార్లు కట్ అయింది. దీంతో జాగ్రత్తపడి రూ.50వేలు స్నేహి తుడికి ఫోన్ పే చేసి, కాపాడుకోగలిగాడు.





రైతులు నుంకేష్, చిత్ర శేఖర్,



నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

రాయప్రోలు సుబ్బారావు (జయంతి)



తెలుగులో భావకవిత్వానికి ఆద్యుడు, 'నవ్య కవితా పితా మహుడి'గా పేరొందిన రాయప్రోలు సుబ్బారావు 1892 మార్చి 13న గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాలో జన్మించారు. గొప్ప జాతీయవాది, తెలుగుజాతి అభిమాని. ఆయన దేశ భక్తి గీతాలు ఎంతో ఉత్తేజాన్ని కలిగించేలా ఉంటాయి. 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీతల్లి భూమి భారతిని నిలుపరా నీజాతి నిండుగౌరవం' పద్యం ఎంతో పేరొందింది. ఆయన రచనలు ప్రధానంగా ఖండకావ్యాలు. 1913లో రాసిన 'తృణ కంకణము'తో తెలుగు కవిత్వంలో నూతనశకంగా భావిస్తారు. ఇందులో అమలిన శృంగారతత్వాన్ని ఆవిష్కరించారు. సమాజానికి అనుగుణంగా భావుకతను అల్లి తెలుగు కవితకు కొత్త సొగసులు అద్దారు. సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. 1984 జూన్ 30న కన్నుమూశారు.

బూర్గుల రామకృష్ణారావు (జయంతి)



బూర్గుల రామకృష్ణారావు 1899 మార్చి 13న రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి సమీపాన పడకల్ గ్రామంలో జన్మించారు. బహు భాషా వేత్త, స్వాతంత్ర్యో ద్యమ నాయకుడు, రచయిత, న్యాయవాది. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి, ఉత్తరప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు గవర్నర్‌గా వ్యవహరించారు. న్యాయవాదిగా ఉంటూనే రాజకీయాల్లో పాల్గొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, కన్నడ, మరాఠీ, ఉర్దూ, పారశీక, సంస్కృత భాషల్లో బూర్గులకు ప్రావీణ్యం ఉంది. ఆయన రచనలు 'సారస్వత వ్యాస ముక్తావళి' పేరిట ప్రచురితమయ్యాయి. గౌరవ డాక్టరేట్‌లు పొందారు. 1967 సెప్టెంబరు 14న గుండెపోటుతో కన్నుమూశారు.

స్వామి విజయేంద్ర సరస్వతి (పుట్టినరోజు)



శంకర విజయేంద్ర సరస్వతి 1969 మార్చి 13న తమిళనాడు రాష్ట్రం తిరువళ్ళూర్ జిల్లాలో జన్మించారు. అసలు పేరు శంకర నారాయణన్. కంచీపురంలోని కంచి కామకోటి పీఠానికి 70వ జగద్గురుగా వ్యవహరిస్తున్నారు. 69వ పీఠాధిపతి జయేంద్ర సరస్వతి శివైక్యంతో ఆయన తర్వాతి స్థానాన్ని 49వ యేట చేపట్టారు. మఠం నియమాల ప్రకారం బాలసన్యాసిగా ఉన్నప్పుడే అప్పటి పీఠాధిపతి తన తర్వాతి పీఠాధిపతిని ప్రకటిస్తారు. ఇలా 1983 మే 29న 70వ పీఠాధిపతిగా ప్రకటించారు. ఆయన వివిధశాస్త్రాలలో నిష్ణాతులు. ప్రత్యేకించి అద్వైత వేదాంతంలో రాణించారు.

ఉత్సాహంగా ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



ఎన్‌ఎస్‌ఎస్ అధికారి కృష్ణమూర్తికి సన్మానం

దొమ్మసంద్ర, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా యమరె గ్రామ పంచాయతీ పరిధిలోని తిగళచౌడదేనహళ్ళిలో జయనగర్ విజయ కళాశాల విద్యార్థులచే 2025 వార్షిక ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ఉత్సాహంగా సాగింది. పీయూ, డిగ్రీ విద్యార్థులలో ఆత్మస్థైర్యం నింపేలా ఆరు రోజులపాటు కార్యక్రమాలు జరిగాయి. పంచాయతీలోని అన్ని గ్రామాలలో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులలో క్రీడ, సంస్కృతి సేవా మనోభావాలను అలవరుచుకోవడం ద్వారా జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవచ్చునన్నారు. మన పూర్వీకులు పాటించిన తృణధాన్యాల ఆహార విధానాన్ని ప్రస్తావిస్తూ కంప్యూటర్ యుగంలోనూ అనుసరణీయమన్నారు. గ్రామపంచాయతీ సభ్యురాలు రాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు ఆరు రోజులపాటు తమ గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాలలో స్వచ్ఛతా కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యమరె గ్రామపంచాయతీ మాజీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలతో ప్రజలలో చైతన్యం కల్పించడంతోపాటు గాంధీజీ కలలు గన్న గ్రామ స్వచ్ఛతకు అడుగులు వేయడం అభినందనీయమన్నారు. విజయ కళాశాల ప్రొఫెసర్ డీఆర్ సుధా, బీజేపీ ముఖ్యులు సమాజసేవకుడు టీవీ బాబు, యమరె గ్రామపంచాయతీ మాజీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, ప్రస్తుత సభ్యులు జయశంకర్, ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం అధికారి డాక్టర్ జి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించాలి



విద్యార్థులను ఆశీర్వదిస్తున్న మంగళనాథస్వామిజీ

శిడ్లఘట్ట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో పాఠాలతోపాటు నైతిక విలువలు పెంపొందించాలని ఆదిచుంచనగిరి మఠం చిక్కబళ్ళాపురశాఖకు చెందిన మంగళనాథ స్వామిజీ పేర్కొన్నారు. ఇల్లే తొలి పాఠశాల అని, సంస్కారం, పెద్దలను గౌరవించడం వంటివి ఇంటినుంచే ప్రారంభం కావాలన్నారు. తాలూకాలోని సాదలి హోబళి దిబ్బూరహళ్ళి బీజీఎస్ ఇంగ్లిష్ స్కూల్, వెంకటేశ్వర హైస్కూల్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి కల్యాణ మండపంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని పిల్లలను ఆశీర్వదించారు. స్వస్తి పేరిట తల్లిదండ్రుల వందన కార్యక్రమం ఏర్పాటైంది. ఈ సందర్భంగా మంగళనాథస్వామిజీ మాట్లాడుతూ పిల్లలు దారి తప్పకుండా సరైన మార్గదర్శకం చేయడంతోపాటు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. దిబ్బూరహళ్ళి ఎస్సై శామలా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించే అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో బీజీఎస్ విద్యాసంస్థల శివరామరెడ్డి, ప్రిన్సిపాల్ మహదేవ్, ముఖ్యులు డాక్టర్ ధనంజయరెడ్డి, దిబ్బూరహళ్ళి రాజణ్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ పన్ను వసూలుకు వేలం



వేలంలో పాల్గొన్న అధికారులు తదితరులు

శిడ్లఘట్ట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట నగరసభ పరిధిలో వివిధ పన్నుల వసూళ్లకు సంబంధించి వార్షిక వేలం నిర్వహించారు. నగరసభ సముదాయ భవనంలో ఏర్పాటైన సమావేశంలో వివిధ వసూళ్ల హక్కులకు సంబంధించి వేలం ప్రక్రియ చేపట్టారు. వారపుసంత, డెయిలీ మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్‌లో గేట్ వసూలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పన్ను వసూలుకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించారు. వారపుసంత మార్కెట్ రూ.3.02 లక్షలు, డెయిలీ మార్కెట్ రూ.3.8 లక్షలు, ప్రైవేట్ బస్టాండ్ గేట్ వసూలుకు రూ.2లక్షలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ శుద్ధీకరణ విభాగం పన్ను వేలం రూ.లక్షకు వేలం జరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి వేలం మొత్తం తక్కువగా ఉండడంపై వేలం ప్రక్రియను రద్దు చేయడమా లేదా వాయిదా వేయడమా అనేది నిర్ణయిస్తామని నగరసభ ఇన్‌చార్జ్ కమిషనర్ మోహన్‌కుమార్ తెలిపారు.

చిన్నారికి శస్త్ర చికిత్స విజయవంతం

చిక్కబళ్ళాపుర, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువు ఎదుర్కొంటున్న సమస్యలకు శస్త్ర చికిత్స నిర్వహించడంలో జీవన్ ఆసుపత్రి వైద్యులు విజయవంతం సాధించారు. జీవన్ ఆసుపత్రి డాక్టర్ ఐఎస్ రావ్, రాజలక్ష్మిల నేతృత్వంలోని వైద్యబృందం శస్త్ర చికిత్స నిర్వహించారు. అన్నవాహిక, ఇతరత్రా సమస్యలు ఎదుర్కొంటున్న 1.5 కిలోల మగశిశువుకు చికిత్సలు చేశారు. గుడిబండ తాలూకాకు చెందిన ఇంజనీర్లు అయిన నిత్యశ్రీ, నారాయణ స్వామిల కుమారుడికి చికిత్సలు విజయవంతం చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం శిశువు కోలుకుని ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఒక అంచనా ప్రకారం 40వేలమంది చిన్నారులలో ఒకరికి ఇటువంటి సమస్య తలెత్తుతుందన్నారు. వైద్యబృందంలో డాక్టర్ శివకుమార్, శ్రీకాంత్‌రెడ్డి, మేగ్ తదితరులు ఉన్నారు.



మీడియాతో వైద్యబృందం తదితరులు

వార్డుల్లో రంజాన్ కిట్ల పంపిణీ

బొమ్మనహళ్ళి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రంజాన్ నేపథ్యంలో గురప్పనపాళ్య, సుద్దగుంటపాళ్య ప్రాంతాలలో ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు, సమాజ సేవకుడు ఆసిఫ్ షరీఫ్ ఆధ్వర్యంలో ఆహారధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. హిందూ, ముస్లింలకు కూడా ఇవ్వడం విశేషం. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ ఏటా రంజాన్ నెలలో ముస్లింలకే కాకుండా హిందువులకు ఆహార కిట్‌లను అందచేస్తున్నట్టు తెలిపారు. ఏటా 8వేలకుపైగా కిట్‌లు ఇస్తున్నామన్నారు. మంత్రి రామలింగారెడ్డి మార్గదర్శకంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పదేళ్లుగా రంజాన్ వేళ ఇలాంటి కిట్‌లు ఇస్తున్నట్టు తెలిపారు. కిట్‌లో బియ్యం, గోధుమపిండి, వంటనూనె, చక్కెర ఇతరత్రా వంట సామగ్రి ఉన్నాయి. ఈ సందర్భంగా మంత్రి రామలింగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి, మాజీ కార్పొరేటర్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



కిట్ అందచేస్తున్న ఆసిఫ్, మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి

రేపటి నుంచి విశేషపూజలు



లక్ష్మీనరసింహస్వామి

బాగేపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని యగవబండ్లకెరె గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయ మూడో వార్షికోత్సవం, కదిరి పున్నమి నేపథ్యంలో ఈనెల 14నుంచి 16వరకు విశేషపూజలు ఉంటాయని ఆలయ అభివృద్ధి సేవా ట్రస్టు అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి తెలిపారు. 14న అభిషేకం, పుష్పాలంకరణ, ప్రాకారోత్సవం, 15వ కళశస్థాపన, గంగపూజ, సత్యసాయి భజన, కోలాట కార్యక్రమం, 16న మూలబింబానికి పంచామృతాభిషేకం, ఆయుష్య సుదర్శన హోమం, శాంతిహోమం తోపాటు లక్ష్మీనరసింహ స్వామికి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. కాగా ఈనెల 16న ఆలయ రాజగోపుర నిర్మాణ పనులకు ఎంపీ డాక్టర్ కే సుధాకర్ శ్రీకారం చుడతారన్నారు. రాష్ట్ర ఒక్కలిగ సంఘం ప్రధాన కార్యదర్శి టీ కోనప్పరెడ్డి, జడ్పీ మాజీ సభ్యుడు హరినాథరెడ్డి, డీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ వీ వెంకటశివారెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు.

మంత్రితో పురసభ అధ్యక్షురాలి భేటీ



మంత్రి మునియప్పను సత్కరిస్తున్న భవ్యమధు తదితరులు

విజయపుర, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణం పురసభ నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన భవ్య మధు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మునియప్పను భేటీ అయ్యారు. మంత్రిని ఆత్మీయంగా సత్కరించారు. ఇదే సందర్భంగా పురసభ అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయించాలని మంత్రికి విన్నవించారు. ఈ సందర్భంగా పురసభ సభ్యులు ఎం సతీశ్‌కుమార్, మంజుళ మునిరాజు, అయేష్ సైఫుల్లా, మాజీ సభ్యులు ముని చిన్నప్ప, సంపత్‌కుమార్, మునికృష్ణ, హరీశ్, జడ్పీ మాజీ సభ్యుడు చందేనహళ్ళి మునియప్ప తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో ఎన్నారై మహిళలకు ప్రత్యేక ఖాతా సౌలభ్యం

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వావలంబనలో భాగంగా ప్రవాస భారతీయ మహిళలకు బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో గ్లోబల్ మహిళ ఎన్‌ఆర్‌ఇ, ఎన్‌ఆర్‌ఓ సేవింగ్స్ అకౌంట్‌లను పరిచయం చేసింది. ప్రభుత్వరంగ బ్యాంకు అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా ఎన్‌ఆర్‌ఐ మహిళలకోసం బీఓబీ ప్రీమియం ఖాతాలను తెరిచేందుకు అనుకూలమని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీనా వహీద్ ప్రకటించారు. ప్రవాస భారతీయ మహిళలు తెరిచే ఖాతాలకు వార్షిక రెన్యూవల్ ఫీజులలో రాయితీలు, కస్టమైజ్డ్ డెబిట్‌కార్డ్, దేశీయ, అంతర్జాతీయ విమానాశ్రయాలలో లాంజ్‌లలో ప్రవేశానికి ఉచిత సౌలభ్యం, తక్కువ వడ్డీతో హౌసింగ్, వాహనాల లోన్‌లు, లాకర్‌ల అద్దెలో వందశాతం రాయితీ, రూ.50 లక్షలదాకా విమాన ప్రమాద బీమా లాంటి సౌలభ్యాలు ఉంటాయన్నారు. ఇటీవలే ముంబైలో ప్రవాస భారతీయ మహిళలకోసం ప్రత్యేక ఖాతా సౌలభ్యాన్ని ప్రారంభించినట్టు బెంగళూరు రీజనల్ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఏకకాలంలో పలు కళాశాలల దరఖాస్తులకు 'అప్లి' యాప్

బెంగళూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో చేరేందుకు దరఖాస్తు నమోదు ప్రతి సంస్థకు ఒకటి చొప్పున సమర్పించడం ఇబ్బందికరంగా ఉండడంతో ఏకకాలంలో పలు కళాశాలలకు దరఖాస్తు చేసుకునే అప్లి యాప్‌ను లాంఛనంగా ఆవిష్కరించారు. బెంగళూరులో బుధవారం యాప్‌ను విడుదల చేశారు. అప్లి కో-ఫౌండర్ సీతాఓ నంజుండప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఏటా కళాశాలల్లో ప్రవేశించేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కళాశాల వెబ్‌సైట్‌ల ద్వారా వివరాలు పొందాల్సి ఉండేదన్నారు. పలు దరఖాస్తులు భర్తీ చేసి వాటిని సంబంధిత కళాశాలలకు సమర్పించాల్సి ఉండేదన్నారు. గత ఏడాది పిల్లలకోసం ఇబ్బంది పడ్డానని అందుకే అప్లి యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చానన్నారు. మొబైల్ ఆధారిత సాధారణ అప్లికేషన్ ప్లాట్‌ఫాం అన్నారు. విద్యార్థులు డేటాబేస్ ద్వారా కళాశాల కోర్సులను, నిబంధనలను, క్యాంపస్‌లో లభించే సౌలభ్యాలు తెలుసుకోవచ్చునన్నారు. విద్యార్థులు షార్ట్‌లిస్ట్ చేసుకుని భవిష్యత్తులో ఏ కళాశాలలో ఏ కోర్సులో చదవాలనేది సులభతరంగా ఎంపిక చేసుకోవచ్చునన్నారు. డిజిలాకర్ ఇంటిగ్రేటెడ్ ద్వారా ప్రొఫైల్ ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు.

రేపు యోగినారేయణ తాతయ్య జయంతి

శిడ్లఘట్ట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సద్గురు యోగి నారేయణ తాతయ్య జయంతి, పల్లకి ఉత్సవం ఈనెల 14న జరగనుంది. శుక్రవారం ఉదయం 11.30గంటలకు కేరళకు చెందిన చండవాద్య బృంద ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. పట్టణంలోని చింతామణి రోడ్డులోగల బలిజసేవా ట్రస్టు ఆధ్వర్యంలోని వీరాంజనేయస్వామి ఆలయ ఆవరణలో కొలువైన యోగి నారేయణ తాతయ్య మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగనున్నాయి. సద్గురు తాతయ్యకు మహామంగళారతి, తీర్థ ప్రసాదాల అనంతరం పురవీధులలో ఊరేగింపు కొనసాగనుంది.

నిలకడగా చింతపండు ధరలు

హిందూపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): హిందూపురం వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌కు బుధవారం 1573 క్వింటాళ్ల చింతపండు వచ్చింది. మేలు రకం కర్పూలి ధర తగ్గినా రెండో, మూడో రకం ధరలు నిలకడా ఉన్నాయి. మేలురకం కర్పూలి క్వింటాల్ రూ.33వేలు ధర పలకగా రెండోరకం రూ.15వేలు, మూడో రకం రూ.8వేలు పలికాయి. అదేవిధంగా మా ర్కెట్‌కు వచ్చిన ఫ్లవర్‌రకాల్లో మొదటి రకం రూ.13వేలు, రెండో రకం రూ.6 వేలు, మూడో రకం రూ.4,300పలికాయి.

జయప్రదం చేయండి

చిలమత్తూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 17న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛభారత్ కార్మికులు గ్రామాలను పరిశుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు కష్టపడుతున్నారని, అయితే వారి సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా ఉండిపోయాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్మికుల సమస్యలను గాలికి వదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఎంతో ఆశతో ఉన్నారని, అయితే పరిస్థితి మారలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టామన్నారు. దీనిని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతి గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొని తమ డిమాండ్లను సాధించుకునేందుకు కదలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ రామచంద్ర, లక్ష్మీనారాయణ, గౌస్, చలపతి, రఫీక్, నరసింహప్ప, నాగప్ప, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'కొత్త ఎమ్మార్పీతోనే అమ్మకాలు'

సోమందేపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైన్‌షాపులకు సరఫరా అవుతున్న మద్యానికి సంబంధించి కొత్త ఎమ్మార్పీ ధరలు బిల్లింగ్‌లో ఉన్నట్లు సీఐ సృజన్ బాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో లైసెన్సులకు 20శాతం మార్జిన్ రావాల్సిఉండగా 10శాతం మాత్రమే లభిస్తున్నందున ప్రభుత్వం మార్జిన్‌ను పెంచుతూ నిర్ణయం తీసుకుందన్నారు. దీని ఫలితంగా రూ.99 లిక్కర్ మినహా అన్ని బ్రాండ్ బాటిళ్లపై రూ.10 పెంచుతూ నిర్ణయం తీసుకుందన్నారు. అయితే కొత్తరేట్లకు సంబంధించి లేబుళ్లు అందుబాటులోకి రాలేదన్నారు. దీంతో మద్యం షాపుల్లో కొత్త ధరలతో ప్రైస్ లిస్ట్ డిస్‌ప్లేలో ఉంచడం జరిగిందని, ఇది తెలియని కొనుగోలుదారులు రూ.10 పెంచి అమ్ముతున్నట్లు అపోహపడుతున్నారన్నారు. ప్రైస్‌లిస్ట్‌కు మించి అమ్మకాలు జరిపితే 9440902566కు సమాచారం అందించాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ధర్మవరంరూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలో సీతారంపల్లి వద్ద బొలెరో వాహనంలో అక్రమంగా బెంగుళూర్‌కు తరలిస్తు న్న 76 (ఒక్కోటి 50 కేజీలు) బస్తాలను రూరల్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై సీతారాంపల్లి వద్ద వాహనాలను త నిఖీ చేస్తుండగా.. ఓ బొలెరో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి.. ఇద్ద రు వ్యక్తులు పారిపోవడానికి యత్నించారన్నారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారని, రేషన్ బియ్యం, వాహనాన్ని స్టేషన్‌కు తరలించామని అన్నారు. నిందితులు సోమందెపల్లికు చెందిన వారిని, వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారి ఇందిరా

రాయచూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యా, శిక్షణ సంస్థ డైట్ అభివృద్ధి విభాగ సబ్ డైరెక్టర్ ఇందిర అన్నారు. నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మహిళలు ఘనతవైపు కాకుండా విలువలవైపు పయనించాలని ఉద్బోధించారు.

నగదు స్వాహాపై కేసు

గాండ్లపెంట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నగదు స్వాహాపై కేసు నమోదు చేసినట్లు జమేదార్ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మండలంలోని చామాలగొంది పంచాయతీ బయ్యారెడ్డిగారిపల్లికి చెందిన పూజారి సరస్వతి కుమార్తె అరబ్ దేశాల్లో ఉంటోంది. సరస్వతికి చదువురాకపోవడంతో రెడ్డివారిపల్లి చెందిన మల్లికార్జున ఎస్‌బీఐలో ఆమె పేరుతో అకౌంట్ ఓపెన్ చేయించాడు. అయితే సెల్ నెంబర్ మాత్రం మల్లికార్జునదే ఇచ్చాడు. దీంతో ఆమె అకౌంట్‌ను ఇతని సెల్ నెంబర్‌తో అనుసంధానం చేసుకున్నాడు. సరస్వతి కుమార్తె పంపే డబ్బులను మొదట్లో మల్లికార్జున డ్రా చేసి ఇచ్చేవాడు. అనంతరం దాదాపు రూ. రెండు లక్షల దాకా సొమ్మును కాజేశాడు. ఆలస్యంగా విషయాన్ని తెలుసుకున్న సరస్వతి.. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

నాటి చిలుక రథమే నేటి ఖాద్రీశుడి బ్రహ్మారథం

పావగడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కదిరి పట్టణంలో ప్రతి పాల్గుణ మాసం పౌర్ణమి రోజున బ్రహ్మ రథోత్సవం జరుగుతుంది. పావగడకు చెందిన సాసుల చిన్నమ్మ చిన్ననాడు తయారు చేసిన చిలుక రథమే నేడు కదిరి పట్టణంలో బ్రహ్మారథంగా ఉందని చరిత్ర చెబుతోంది. పావగడకు సమీపంలో ఉన్న తిమ్మాపురం గ్రామంలో నాగిరెడ్డి, శీలం కొండమ్మ దంపతులకు ఆరుగురు మగ సంతానం. అయితే ఆడబిడ్డ కావాలని శీలం కొండమ్మ కదిరికి నడుచుకుంటూ వెళ్లి నృసింహుడి వద్ద వేడుకుందట. ఏడవ సంతానంగా ఆడబిడ్డ పుట్టడంతో బిడ్డకు సాసుల చిన్నమ్మగా నామకరణం చేశారు. చిన్నప్పటి నుంచి ఆమె నృసింహుడిపట్ల భక్తిభావంతో పెరుగుతూ వచ్చింది.



చిన్నమ్మకు ఉయ్యాల కట్టిన ప్రదేశం




చిన్నమ్మ నివసించిన ఇల్లు

తిమ్మాపురం నుంచి ఓలుగండ్లకు ప్రయాణం

ఆరుగురు అన్నగార్లకు ప్రతిరోజూ భోజనం తీసుకుని నలిగానహళ్లి గ్రామం దగ్గర జొన్న తోటలకు చిన్నమ్మ వెళ్లేది. మొక్కజొన్న బెండ్లతో చిన్న రథం తయారుచేసి అందులో స్వామివారిని ఉంచి ఆడేదట. ఆమె భక్తికి పరవశించిన నృసింహుడు చిలుకల కావిలిగా వెళ్లి చిన్నమ్మకు చిలుకల రథాన్ని ప్రసాదించాడు. ఆ రథంలో పావగడవైపు ఊరేగుతుండగా ఓలుగొండ్ల నుంచి ఎద్దుల వ్యాపార నిమిత్తం పావగడకి వచ్చిన నాగిరెడ్డి ఆ రథంలో ఊరేగుతున్నది దేవత అని మొక్కాడు. చుట్టుపక్కల ఉన్నవారు ఆయన మొక్కడాన్ని చూసి ఆడదాన్ని మొక్కడం ఏంటని నవ్వారు. అప్పటి నుంచి చిన్నమ్మను తన ఇంటి కోడలుగా చేసుకుని చిత్రహింసలు పెట్టాలని నాగిరెడ్డి నిర్ణయించుకున్నాడు. నాగిరెడ్డి ఆరవకుమారుడు వెంగల్‌రెడ్డితో చిన్నమ్మకు వివాహంచేశారు. అప్పటి నుంచి నాగిరెడ్డి, అతడి కుమారులు ఆమెను చిత్రహింసలు పెట్టేవారు. తనను ఇంత బాధపెడుతున్నా తన తల్లిదండ్రులు, అన్నలు తన పరిస్థితిని అర్థంచేసుకోలేదని ఆ కుటుంబాన్ని శపించింది. అప్పటి నుంచి ఆ కుటుంబంలో వికలాంగులు పుడుతుండటం ఇప్పటికీ జరుగుతోందని గ్రామస్థులు చెబుతున్నారు.

చిలకల రథంలో కదిరికి..

ఒకానొక సందర్భంలో నాగిరెడ్డి, అతడి కొడుకులు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. తమ అనారోగ్యం తగ్గిపోవాలని నృసింహుడికి వేడుకోగా తన సన్నిధికి చిన్నమ్మను తీసుకురావాలని వారిని స్వామివారు ఆజ్ఞాపించాడు. దీంతో వారు చిన్నమ్మను బతిమలాడగా పావగడలో తన చిలకల రథాన్ని కోనేటిలో ఉంచానని అందులోనే కదిరి దాకా ఊరేగుతానని ఆమె వారితో చెప్పింది. అనుకున్నట్లే మడకశిర, పులగంపల్లి మీదుగా కదిరికి రథంలో చేరి స్వామివారిని దర్శించుకుంది. ఆ రథమే ఇప్పటి బ్రహ్మారథంగా విరాజిల్లుతోంది. ఇప్పటికీ పావగడకు చెందిన ఆడబిడ్డలు వచ్చి రథాన్ని ముడితేనే బ్రహ్మారథం ముందుకు సాగే సాంప్రదాయం ఉంది. ఇప్పటికీ పావగడలో చిన్నమ్మ భక్తిని నాటకాల రూపంలో కళాకారులు చాటుతూవుంటారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1601.69	1,584.25
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,985	2,042
నీటి నిల్వ (టీఎంసీలు)	23.79	6.85

సోమసముద్రం పంచాయతీ అధ్యక్షురాలిగా రాజేశ్వరి



రాజేశ్వరిని అభినందిస్తున్న సభ్యులు

బళ్లారి రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని సోమసముద్రం నూతన గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా రాజేశ్వరిని ఎన్నుకున్నారు. బుధవారం సోమసముద్రం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవో నిర్మల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. సర్వసభ్యుల సహకారంతో రాజేశ్వరి సిద్దలింగప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా ఆమె బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో పీడీవో సిద్దలింగప్ప, ప్రముఖులు మహేష్, మంజునాథ్, కే తిప్పేస్వామి, పచ్చన్న, పుల్లయ్య, బసవరాజు, మల్లప్ప, రాజశేఖర్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఉచిత నేత్ర పరీక్ష శిబిరం



కంటి పరీక్షల అవగాహన ర్యాలీ

సిరుగుప్ప, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని అచ్చొళ్లి ప్రభుత్వాస్పత్రిలో ఉచిత నేత్ర పరీక్ష శిబిరం నిర్వహించారు. బళ్లారి విమ్స్, సిరుగుప్పకు చెందిన కంటి వైద్య నిపుణులు 56 మందికి కంటి పరీక్షలు చేశారు. 21 మందికి ఆపరేషన్లు చేయాలని వైద్యులు నిర్ధారించారు. వైద్యులు లింగరాజరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

హక్కులపై మహిళలు అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థినులు

రాయచూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మహిళల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఫస్ట్‌గ్రేడ్ న్యాయాధికారి, న్యాయాసేవా ప్రాధికార సభ్య కార్యదర్శి హెచ్‌ఏ సాత్విక్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయాధికారి పాల్గొని మాట్లాడారు. మహిళల రక్షణకు సంబంధించి అనేక చట్టాలు ఉన్నా దైనందిన జీవితంలో ఉపయోగపడే ప్రాథమిక చట్టాల పట్ల మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు. ఆ దిశగా న్యాయసేవా ప్రాధికార సంస్థ చేస్తున్న ప్రయత్నంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

కల్తీకల్లు రవాణా చేస్తున్న వ్యక్తుల అరెస్టు

రాయచూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రైలు మార్గం ద్వారా నగరంలోకి అక్రమంగా కల్తీకల్లు రవాణా చేసి విక్రయిస్తున్న ఇద్దరిని బుధవారం ఎక్సైజ్ శాఖ అధికారులు అరెస్టు చేశారు. రైల్వే స్టేషన్ వద్ద గస్తీ తిరుగుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలంగాణ ప్రాంతం నుంచి అక్రమంగా కల్లును తెస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడగా వారి వద్ద నుంచి 30 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో ఒకరు నగరంలోని మంగళవారపేటకు చెందిన కరియప్ప కాగా మరొకరు ఇందిరా నగర్‌కు చెందిన ఖాజాలగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

హొస్పేట్‌లో చక్కెర కర్మాగారం ఏర్పాటు చేయాలి

- అఖిల కర్ణాటక కిసాన్ జాగృతి సంఘం డిమాండ్
- రైతులతో హంపి నుంచి హొస్పేట్ వరకు పాదయాత్ర



హంపి విరూపాక్షేశ్వర ఆలయం నుంచి పాదయాత్రను ప్రారంభించిన రైతులు

బళ్లారి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాలతో ఈప్రాంతంలో విస్తారంగా రైతులు చెరకు పంటను సాగుచేస్తున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని హొస్పేట్‌లో చక్కర తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయాలని విశ్రాంత లోకాయుక్త జస్టిస్ ఎన్.సంతోష్ హెగ్డే డిమాండ్ చేశారు. అఖిల కర్ణాటక రాష్ట్ర కిసాన్ జాగృతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం హంపిలోని విరుపాక్షేశ్వర దేవాలయం నుంచి హొస్పేట్ వరకు రైతులతో కలిసి పాదయాత్ర చేశారు. చక్కెర పరిశ్రమ ఏర్పాటు కోసం రైతులు ప్రారంభించిన పాదయాత్రకు వేలాది మంది రైతులు. వివిధ స్వచ్ఛంద సంస్థలు మద్దతు ఇచ్చాయి. విశ్రాంత లోకాయుక్త జస్టిస్ సంతోష్ హెగ్డే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విస్తారంగా చెరకు పంటను రైతులు పండిస్తున్నారని అన్నారు. ఇక్కడ చక్కర పరిశ్రమ లేకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం హొస్పేట్ ప్రాంతంలో చక్కెర పరిశ్రమను ప్రారంభిస్తాని హామీఇచ్చాందని, ఇందుకు కట్టుబడి రైతులు కోసం పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్ర సాగించే రైతులకు దారి పొడవునా పలు గ్రామాల ప్రజలు, రైతులు మద్దతు తెలిపారు.

ఘనంగా రేణుకాచార్య జయంతి



ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, వీరశైవ సంఘం నాయకులు

బళ్లారి సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వీరశైవ లింగాయత్ సమాజం, జిల్లా యంత్రాంగం బుధవారం జగద్గురు రేణుకాచార్య జయంతిని ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ కళాశాల మైదానం నుంచి రేణుకాచార్య చిత్రపటానికి పూజలు నిర్వహించి ఊరేగించారు. మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, వీరశైవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బిచ్చుగల్ పంచాక్షరప్ప, విద్యావర్ధక సంఘం కార్యనిర్వాహక కమిటీసభ్యులు, సంఘ నాయకులు పాల్గొన్నారు. డొల్లు, సాంస్కృతిక బృందాలతో ఊరేగింపు గడిగి చెన్నప్ప సర్కిల్, బెంగళూరు రోడ్డు తేరువీధి, గవియప్ప సర్కిల్ మీదుగా జోళదరాశి దొడ్డనగౌడ రంగ మందిరకు చేరుకుంది. కమ్మరచేడు కల్యాణస్వామి జయంతి సందర్భంగా ప్రత్యేక ఉపన్యాసం చేశారు. రేణుకాచార్య లాంటి మహనీయుల అడుగుజాడలో యువత నడవాలని పిలుపునిచ్చారు.

సిరుగుప్ప: రేణుకాచార్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక తాలుకా పరిపాలనా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైస్కూలు గ్రౌండ్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు రేణుకాచార్య భావచిత్రటాన్ని ఊరేగించారు. తహసీల్దార్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఆత్మజ్ఞానాన్ని తెలిపిన మహనీయుడు రేణుకాచార్య అని కొనియాడారు. పంచాయతీ ఈవో పవన్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సత్యమ్మ, బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జున, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయచూరు: సేవాతత్వం శాంతి నిబద్ధత తదితర విలువలతో కూడిన మార్గాన్ని సూచించిన జగద్గురు రుణుకాచార్య సందేశం నేటి మానవ సమాజానికి అనుసరణీయమని స్థానిక కిల్లేబృహన్మఠం పీఠాధిపతి శాంతమల్ల శివాచార్య మహాస్వామి అన్నారు. రేణుకాచార్య కేవలం వీరశైవ ధర్మానికి సంబంధించిన వారు మాత్రమే కాదని, మానవ కులానంతటికి సన్మార్గంలో నడిపేందుకు ఆయన పడిన తపన చేసిన సేవా సూచించిన వచనం నేటితరానికి సజీవమేనన్నారు. స్థానిక మంగళవారపేటలోని హిరేమఠం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించిన నిర్వాహకులు బైపాస్ రోడ్డులోని రేణుకాచార్య సర్కిల్ వరకు వెళ్లి అక్కడి నుంచి జగద్గురు చిత్రపటాన్ని స్థానిక వీరశైవ కల్యాణ మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు.



సిరిగుప్పలో రేణుకాచార్య చిత్రపటాన్ని ఊరేగిస్తున్న తహసీల్దార్, నాయకులు

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న కార్మిక సంక్షేమ రక్షణ వేదిక సభ్యులు

కంప్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కేపీసీఎల్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చి న్యాయం చేయాలని కార్మిక సంక్షేమ రక్షణ వేదిక గౌరవాధ్యక్షుడు వెంకటరమణబాబు డిమాండ్ చేశారు. కుడితిని పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2006లో కేపీసీఎల్ బీటీపీఎస్ ప్లాంట్ ఏర్పడిందన్నారు. ఇక్కడి ఫ్యాక్టరీలో 2242 మంది కార్మికులు తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని అన్నారు. ఫ్యాక్టరీ అధికారులు, కాంట్రాక్టర్లు భాగస్వాములై కార్మికులను దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని పరిగణలోకి తీసుకుని 2024 సెప్టెంబరు 20న కార్మికుల రక్షణ వేదిక అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ ఎదుట నిరసన చేపట్టారు. అయితే అధికారులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వినతిపత్రం సమర్పించి వెనక్కి తీసుకున్నారు. అయినా ఇప్పటివరకు కార్మికులకు న్యాయం జరగలేదన్నారు. కార్మికులకు కనీస వేతనం పెంపుదల వల్ల కలిగే ఆర్థిక భారంపై నివేదిక ఇవ్వాలని ఫ్యాక్టరీ కార్మికులు కార్మికశాఖ మంత్రి సంతోష్ లాడ్ దృష్టికి తీసుకెళ్లారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని విరమించేది లేదని హెచ్చరించారు. పట్టణ పంచాయతీ ఉపాధ్యక్షులు కనికేరి పంపాపతి, కార్మికులు అంబరీష్, సడక్ అలీ, హనుమయ్య, సురేష్, రాఘవేంద్ర, వెంకటరెడ్డి, ప్రశాంత్, హుస్సేనప్ప పాల్గొన్నారు.

కంప్లి పురపాలక బడ్జెట్ రూ.65.95 కోట్లకు ఆమోదం

కంప్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొట్టాల్ రోడ్డు నీటి శుద్ధి ప్లాంట్ ఆవరణలో పురపాలక సంఘం 2025-26 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమర్పించారు. మున్సిపల్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఎం ఉస్మాన్ ప్రస్తుత యేడాది మున్సిపాలిటీకి రూ.65.95 కోట్ల పొదుపు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సమావేశానికి బట్టా ప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఇక్కడి అన్ని వార్డులు సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సభ్యులందరి సహకారంతో బడ్జెట్‌లో పేర్కొన్న పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. అంచనా ఆదాయం రూ.2.70 కోట్లు ఇంటి పన్ను, రూ.75 లక్షలు నీటి చార్జీలు, రూ.35 లక్షలు, షాపుల అద్దె రూ.పది లక్షల, మార్కెట్ ఇతర చార్జీలు రూ.47 లక్షలు, బిల్డింగ్ యాక్ట్ ప్రాజెక్టు సంబంధిత రుసుం రూ.2 కోట్లు, అభివృద్ధి రుసుం రూ.పది లక్షలు, వ్యాపార లైసెన్స్ ఫీజు సాధారణ ఆదాయాలు అంచనా, ప్రభుత్వ ఆదాయం రూ.2 కోట్లు, 15వ ఫైనాన్స్ గ్రాంటు, పార్లమెంట్, అసెంబ్లీ సభ్యులకు రూ.80 లక్షలు ప్రాంతీయఅభివృద్ధి గ్రాంట్ రూ.30 లక్షలు, ప్రకృతి వైపరీత్యాల సహాయ నిధి రూ.50 లక్షలు ఇతర గ్రాంట్లు రూ.పది కోట్లు, పట్టణాభివృద్ధి ప్రణాళిక గ్రాంట్లు, టౌన్ డెవలప్‌మెంట్ గ్రాంట్లు రూ.50 లక్షలు, స్వచ్ఛభారత్ యోజన గ్రాంట్లు రూ. 3.75 కోట్లు, ఫైనాన్స్ కమిషన్ స్పెషల్ గ్రాంట్లు రూ.5 కోట్లు, మెయిన్ ఎఫెక్టెడ్ ఏరియా డెవలప్‌మెంట్ గ్రాంట్ ప్రభుత్వ ఆదాయాన్ని ఆశించాయి. ప్రభుత్వ వ్యయం నడువాల మసీదు నుంచి జోగి కెనాల్ వరకు రూ.2 కోట్లతో రోడ్డు అభివృద్ధి, రూ.4.80 కోట్లతో డ్రైనేజీ నిర్మాణం, రూ.7.80 కోట్లతో పట్టణ రోడ్ల అభివృద్ధి, అంతర్గత డ్రైనేజీ, మంచినీటి సరఫరా ప్రాజెక్టు, రూ.3లక్షలు, సీటీఆర్ రూ. 5 కోట్లుతో సరస్సు అభివృద్ధి రూ. 5 కోట్లతో నీటి సరఫరా పథకం ఊహించిన ప్రభుత్వ ఖర్చులు కూడా ఉన్నాయి. అంచనా వ్యయం రూ.3.41 కోట్లు పబ్లిక్ ఎలక్ట్రిసిటీ, స్ట్రీట్ లైటింగ్ నిర్వహణ వ్యయం రూ.1.11 కోట్లు ప్రజారోగ్య వ్యయం రూ.2.80 కోట్లు నీటి సరఫరా నిర్వహణ వ్యయం రూ.33 కోట్లు, రూ.46.50 లక్షలు, 24.10 శాతం ఎస్సీ, ఎస్టీ వ్యయం రూ.75.68 లక్షలు, 7.25 పేద ప్రజలు ఇతర సంక్షేమ అభివృద్ధి వ్యయం 5 శాతం, దివ్యాంగుల సంక్షేమాభివృద్ధికి రూ.51.80 లక్షలు, పబ్లిక్ గార్డెన్స్ నిర్మాణానికి రూ.25లక్షలు, సాధారణ ఖర్చులు అంచనా వేస్తున్నట్లు రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అధికారి కే దుర్గన్న, ఉపాధ్యక్షులు సుశీలమ్మ, వీఎల్ బాబు, సీఆర్ హనుమంతు, రామాంజనేయులు, నాగరాజు, వీరాంజనేయ, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.



పురపాలక బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న దృశ్యం



మాట్లాడుతున్న షెడ్యూల్డ్ కులాలు, తెగల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ పల్లవి

గృహ సౌకర్యం కల్పించండి

- ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ పల్లవి

బళ్లారి సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ తాలూకాల్లో షెడ్యూల్డ్ కులాలు, తెగల సంచార వర్గాలలో ఇళ్లులేని వారికి స్థలాలు, గృహ సౌకర్యాలు కల్పించాలని కర్ణాటక షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంచార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ పల్లవి డిమాండ్ చేశారు. నగరంలోని కొత్త జిల్లా పరిపాలన భవనంలోని ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన ప్రగతి సమీక్ష, సంప్రదింపుల సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. సంచార సమాజాలు జీవనోపాధి కోసం పలు ప్రాంతాలు తిరుగుతూ జీవనం సాగిస్తున్నాయని అన్నారు. వారికి ఇళ్లులేవని, అధికారులు ఆశ్రయం కల్పించడాన్ని ప్రాధాన్యతగా పరిగణించాలన్నారు. కలెక్టర్ తగిన భూమిని గుర్తించి ప్లాట్లు కేటాయిస్తారన్నారు. జిల్లాలోని వివిధ సంచార వర్గాల కుల వివరాలను నిర్ధారించేందుకు సాంఘిక సంక్షేమ శాఖ, సంబంధిత తహసీల్దార్లు, ఇతర శాఖల సహకారంతో ఉమ్మడి సర్వే నిర్వహించాలన్నారు. మనం విద్యకు దూరం కాకూడదని, విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి దివాకర్, జిల్లా అమలు కమిటీ సభ్యులు, వివిధ సంచార జాతుల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

హంపికి తగ్గిన పర్యాటకులు



విదేశీ పర్యాటకులు లేక బోసిపోయిన రిసార్ట్

గంగావతి రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సనపూర్, పరిసర ప్రాంతాలు విదేశీ పర్యాటకులతో సందడిగా ఉండేవి. అవి ఇప్పుడు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఏడాది పొడవునా హంపి, కమలాపూర్, అనేగొంది, పంపా సరస్సు ఇతర చారిత్రక ప్రదేశాలకు విదేశీ పర్యాటకులు వచ్చేవారు. హోలీ పండుగ సమయంలో వారు రంగుల పండుగలో పాల్గొనేందుకు సనపూర్ సరస్సుకు వచ్చేవారు. ఈసారి సనపూర్‌లో ఇద్దరు యువతులపై అత్యాచారం, ఒక యువకుడి హత్య ఘటన విదేశీయుల్లో ఆందోళన రేకెత్తించింది. విదేశీయులు రంగుల పండుగను ఎంతో ఇష్టపడేవారు. ప్రతి సంవత్సరం స్థానికులతో కలిసి పాల్గొనేవారు. డీజే శబ్దానికి అనుగుణంగా నృత్యం చేస్తూ ఉత్సాహంలో మునిగిపోయేవారు. రిసార్టులను రంగురంగుల లైట్లతో అలంకరించారు. ప్రస్తుతం అవి పర్యాటకులు లేకుండా నిర్మానుష్యంగా మారిపోయాయి. హోలీ వేడుకల కోసం సనపూర్, హనుమాన హళ్ళి, ఆనేగొంది ప్రాంతాల్లోని రిసార్టులు, హోమ్‌స్టేలలో 400 మందికిపైగా దేశీయ,విదేశీ పర్యాటకులు తమ ముందస్తు బుకింగ్‌లను రద్దు చేసుకున్నారని రిసార్ట్ యజమాని సునీల్‌బాబు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

బళ్లారి సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కంటోన్మెంట్ ప్రాంతంలోని జూనియర్ టెక్నికల్ స్కూల్ 2000-01 బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం ఒక ప్రైవేటు హోటల్‌లో రజతోత్సవ కలయిక కార్యక్రమం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయులు శ్రీరామదాస్, శివశంకర్, తిప్పేస్వామి, సుమ, గిరిజలను విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కెంచప్పబాబు, సంగమేశ్వర్, రాజశేఖర్, రవికుమార్, ప్రదీప్, హయత్, అశోక్, శివలింగస్వామి, సరస్వతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నారీశక్తి సప్తాహం



మహిళా సాధకులను సత్కరిస్తున్న పోస్ట్ మాస్టర్ జనరల్ చిదానంద

బళ్లారి సిటీ,మార్చి 12(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా తపాలా శాఖ నారీ శక్తి సప్తాహాన్ని ఘనంగా నిర్వహించారు. పోస్టాఫీసులలో వివిధ హోదాల్లో పనిచేసి, ప్రజాసేవలో గణనీయమైన సేవలందించిన, మహిళా సాధకులను గుర్తించి సత్కరించారు. నారీశక్తి సప్తాహలో భాగంగా బళ్లారి పోస్టల్ డివిజన్‌లోని మొత్తం 24 మంది మహిళా సిబ్బంది, పొదుపు ప్రతినిధులు, నగరంలోని కోట ప్రాంతంలోని పోస్టల్ డివిజనల్ కార్యాలయంలో పోస్ట్ మాస్టర్ జనరల్ పద్మశాలి చిదానంద సన్మానించారు. ఆమె మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, తమ కుటుంబాలతో కలిసి దేశ పురోగతికి కృషి చేస్తున్నారని, ఇది మంచి పరిణామమని ఆమె అన్నారు. డివిజన్‌లోని అసిస్టెంట్ సూపరింటెండెంట్లు, పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు, చీఫ్ పోస్ట్ మాస్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కేకే ఆర్టీసీ బస్సు బోల్తా.. 25 మందికి గాయాలు

బళ్లారి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కొప్పళ తాలూకా అలవండి గ్రామం వద్ద బుధవారం ఉదయం కొప్పళ డిపోకు చెందిన కేకేఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మంది విద్యార్థులు, 10 మంది ప్రయాణికులకు గాయపడ్డారు. కల్యాణ కర్ణాటక ఆర్టీసీ బస్సు ఉదయం 8 గంటల ప్రాంతంలో స్కూల్ పిల్లలతో పాటు ప్రయాణికులు తీసుకుని కొప్పళకు బయలుదేరింది. బస్సులో 120 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. అలవండి వద్ద రోడ్డు విస్తారణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు పక్కన ఉన్న కొద్దిపాటి గుంతలోకి బస్సు చక్రాలు దిగాయి. బస్సు రోడ్డు నుంచి కిందకు వాలిపోయింది. ఈ ప్రమాదంలో బస్సు అద్దాలు పగిలిపోయాయి. గాజుముక్కలు కుచ్చుకుని కొందరికి, తొక్కిసలాటలో మరికొందరికి గాయాలయ్యాయి. కొందరు బస్సులో నుంచి బయటకు వచ్చిన ప్రయాణికులు పోలీసులకు, 108కి సమాచారం ఇచ్చారు. వెంటనే 108వాహనం, అలాగే పక్కనే ఉన్న గ్రామస్థులు వచ్చి గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.



బోల్తాపడిన కేకేఆర్టీసీ బస్సు

హొసూరు జోన్

మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన



గిఫ్ట్ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

హొసూరు(కృష్ణగిరి), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా బర్గూరు పంచాయతీ యూనియన్ ఒరప్పం అదనపు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గాంధీకుప్పం ఆదర్శ క్రాఫ్ట్ మహిళా స్వయం సహాయక బృందం సిద్ధం చేసిన కుట్లు, అల్లికలతో రూపొందించిన పలు రకాల బహుమతి ఉత్పత్తులను ప్రదర్శించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్ దినేశ్‌కుమార్ స్వయంగా సందర్శించారు. తదనంతరం తమిళనాడు గ్రామీణ జీవనోపాధి ఉద్యమం (మహిళల ప్రాజెక్టు) కింద కందికుప్పం పంచాయతీలోని మహిళా స్వయం సహాయక సంఘం సభ్యుల కేంద్రాన్ని స్వయంగా సందర్శించారు. ఇక్కడి కేంద్రంలో వస్త్రాల ఉత్పత్తులను విలువ, జోడించి వివిధ రకాల సిల్క్ ఫ్యాబ్రిక్‌లను ఉపయోగించి రంగు రంగుల ఆభరణ పెట్టెలను అలంకరణ చేసి ప్రదర్శనకు ఉంచారు. నిత్యం ఉపయోగించే పర్సులు, హ్యాండ్‌బ్యాగులు, తయారీని పరిశీలించారు. అనంతరం ఒరప్పం అదనపు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల రోజువారీ హాజరు నమోదు, గర్భిణీల వివరాల నమోదు, గర్భిణులకు ఇస్తున్న చికిత్స నిరంతర పర్యవేక్షణ, మందులు, మాత్రలు, పాముకాటు, కుక్కల కాటుకు అవసరమైన వ్యాక్సినేషన్‌ల స్టాక్‌లను పరిశీలించారు. అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య వారికి ఇస్తున్న చికిత్సలు, సలహాలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఆరోగ్యశాఖాధికారి రమేశ్‌కుమార్, బర్గూరు జిల్లా వైద్యాధికారి శివకుమార్, బర్గూరు జిల్లా పొన్నాల, తమిళనాడు గ్రామీణ జీవనోపాధి సహాయ అధికారులు రాజశేఖర్, గణేశన్, పళని, జిల్లా లోన్ సేల్స్ అసోసియేషన్ మేనేజర్ లోకరక్షకి తదితరులు పాల్గొన్నారు.

అడవుల్లో చెత్తను కాల్చవద్దు



చెత్తను కాల్చడంతో పొగలు ఇలా... (ఫైల్)

హొసూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో అపారమైన అడవులు ఉన్నాయి. విస్తారంగా ఉన్న అటవీప్రాంతంలో చెత్తను కాల్చివేయడం వల్ల వన్యప్రాణులకు సమస్య తలెత్తడంతోపాటు పచ్చటిచెట్లు కాలిపోతున్నాయని అలా చేయరాదని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. హొసూరు సానమావు రాయకోట, అంచెట్టి, జవలగిరి, అటవీ ప్రాంతాల్లో ఏనుగు, చిరుత, జింకలు, ఇతర అరుదైన జాతుల అడవిజంతువులు, పక్షులు ఉన్నాయి. ప్రతి సంవత్సరం వేసవికాలంలో పొదల ప్రాంతాలలో కొందరు పశువులను మేపేందుకు వస్తుంటారు. కొందరు పశువుల కాపరులు బీడీ, సిగరెట్ తాగి పడేయడంతో ఏర్పడే మంటలు భారీగా చెలరేగి, ఒక్కోసారి కార్చిచ్చుగా మారుతోందని, ఇతర సమస్యలకు కారణమవుతున్నాయని అధికారులు అంటున్నారు. వన్యప్రాణులకు ముప్పు వాటిల్లకుండా ప్రజలు సహకరించాలని కోరారు.

రథోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన మేయర్

హొసూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): హొసూరు నగరంలో ప్రసిద్ధమైన తేరుపేట వద్ద హొసూరు కార్పొరేషన్ పరిధిలోని వార్డ్ నెంబర్ 30లో ఈనెల 14న చంద్రచూడేశ్వర స్వామి రథోత్సవం జరగనుంది. రథోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను మేయర్ సత్య, కమిషనర్ మారిసెల్వి, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, ప్రజారోగ్య కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, తేరుపేట ప్రాంతంలోని వీధులను పాఠశాలలను పరిశీలించారు. రథోత్సవానికి వేలాదిమంది తరలిరానుండడంతో మౌలిక సదుపాయాలలో లోటు ఉండరాదని సూచించారు. తాగునీటి సౌకర్యం, విద్యుద్దీపాలు, అవసరమైన మేరకు ఫోకస్‌లైట్లు వంటి పనులు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి రాజి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పార్వతి నాగరాజు, మున్సిపల్ వెల్ఫేర్ అధికారి అజిత, అసిస్టెంట్ కమిషనర్ టీలో, అసిస్టెంట్ ఇంజనీర్ హెల్త్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ సత్య, నాయకులు